క్లుప్తంగా

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో మంగళవారం ఉదయం పది గంటలకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు సోమవారం తెలిపారు. అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తొండంగి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పసపులేటి సోమవారం సతీష్ తెలిపారు. తొండంగి జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, ఎంపీపీ దడాల సువర్ణలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు క్రీడా పోటీలను ప్రారంభిస్తారని చెప్పారు.

గండేపల్లిలో...

గండేపల్లి: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రామన్ సోమవారం తెలిపారు. సచివాలయాల పరిధిలో క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కిర్లంపూడి: మండలంలోని 26 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు సోమవారం తెలిపారు. మండలంలో ఆడుదాం-ఆంధ్ర క్రీడలకు 3418 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు.

యూత్ కన్వీనర్ నానిబాబుకు అభినందనలు


కోటనందూరులో నానిబాబును అభినందిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్‌గా నియమితులైన బండి నానిబాబుకు సోమవారం పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. కోటనందూరులో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఏఎంసీ చైర్మన్ లంక ప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు, సర్పంచ్ సుర్ల రాంబాబు తదితరులు నానిబాబును అభినందించారు. తొలుత నానిబాబు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీని బలోపేలానికి కృషి చేయాలని ఎంపీపీ సూచించారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం


మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు తోట వెంకట సర్వారాయుడు అన్నారు. మండలంలోని వీరవరంలో బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు అధ్యక్షతన సోమవారం మండల బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జ్యోతుల దుర్గాప్రసాద్, దొడ్డ అప్పారావు, బాలిన వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

తాటాకిళ్లు దగ్ధం


అల్లిపూడిలో కాలిపోతున్న తాటాకిళ్లు

కోటనందూరు: మండలంలోని అల్లిపూడిలో సోమవారం సాయంత్రం రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొంప వెంకటరమణ, గొంప సత్యనారాయణ, రుత్తల నాగరాజు, రుత్తల రమణ, రుత్తల శ్రీను, రుత్తల సత్యవతి కుటుంబాలు రెండు వసారా తాటాకిళ్లలో నివాసం ఉంటున్నాయి. కాగా సోమవారం వంట చేస్తున్న సమయంలో మంటలు చెలరేగి ఇంటికి నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామగ్రి, నిత్యావసరాలు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు తుని ఫైర్ ఆఫీసర్ కె.రాముడు తన సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు బాధితులను పరామర్శించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షలు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం అంగన్‌వాడీలు చేస్తున్న దీక్షలు సోమవారం కొనసాగాయి. జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు.


పెద్దనాపల్లిలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి


తునిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు


రాఘవపట్నంలో కొవ్వొత్తులతో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


పెద్దిపాలెం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వైభవంగా క్రిస్మస్ వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- అలరించిన శాంతాక్లాజ్, చిన్నారుల వేషధారణలు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెలవారుజాము నుంచే క్రైస్తవులు చర్చిల్లో, ఇళ్ల వద్ద క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి బంధువులు, స్నేహితులకు బిర్యానీతో పాటు కేక్‌లు పంచిపెట్టారు. పట్టణంలోని సీఓఎం, లూథరన్, ఆర్‌సీఎం చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఏలేశ్వరం వైఆర్‌పీ రోడ్డులోని లూథరన్ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక సాయినగర్‌లోని పరిశుద్ధ మందిరంలో పాస్టర్ ఎలైజా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని పెద్దనాపల్లిలో క్రైస్తవులకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి దుస్తులు పంపిణీ చేశారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి

తుని: స్థానిక స్కాట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా పాల్గొన్నారు. పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాస్టర్ల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జీసస్ సూచించిన మార్గంలో ప్రజలంతా నడవాలని ఆకాంక్షించారు. అనంతరం పాస్టర్లు మంత్రి రాజాను శాలువా, పూలమాలతో సత్కరించి సన్మానించారు.


తుని ఎస్ఎంబీ చర్చిలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా


అన్నవరంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్తిపాడులోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో సర్పంచ్ గుడాల విజయలక్ష్మి కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. సంఘ కాపరి రెవరెండ్ ఐజాక్ విలియమ్స్ ప్రసాద్ ప్రార్థనలు చేశారు. సంఘ అధ్యక్షుడు కె.సంజీవరావు, కార్యదర్శి గుడాల సుందర్రావు, ఇంజినీర్ బి.మోహన్ తమ ప్రసంగంలో క్రీస్తు సందేశాన్ని వివరించారు. క్రీస్తు బోధనలను అనుసరించాలని కోరారు. అనంతరం నిరుపేదలకు ధన సహాయం అందించారు. కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు శశిధర్, భాగ్యరత్నం, సుజానమ్మ, చంద్రలీల తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి, ఉత్తరకంచి, పెద్దిపాలెం, గజ్జనపూడి, శరభవరం, చింతలూరు, వాకపల్లి, పోతులూరు, యూజే పురం తదితర గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు జననం విశిష్టతను వివరించారు.

అన్నవరం: క్రిస్మస్‌ను పురస్కరించుకుని సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నవరంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ రాజాల చిట్టిబాబు ఇంటి వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధారా వేంకటరమణ, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, వీర్ల సూరిబాబు, బండారు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. శంఖవరం, కత్తిపూడి, జి.కొత్తపల్లి, మండపం, నెల్లిపూడి గ్రామాల్లోని చర్చ్‌ల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారులు ఆట, పాటలతో సందడి చేశారు. చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

గోకవరం: మండల వ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. గోకవరంలోని సేయింట్ జాన్స్ లూథరన్ చర్చ్, కృష్ణునిపాలెంలోని ఈహెచ్‌హెచ్ చర్చ్‌ల్లో ఉదయం నుంచి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డిలో పాస్టర్ కత్తి అబ్రహాం ఆధ్వర్యంలో చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

రౌతులపూడి: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. చర్చిల వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


విద్యుత్ కాంతుల నడుమ కత్తిపూడి ఆర్‌సీఎం చర్చి


గుమ్మళ్లదొడ్డిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



ప్రత్తిపాడులోని క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

రాఘవపట్నంలో పాస్టర్ జ్యోతిబాబు ఆధ్వర్యంలో క్రైస్తవులు కొవ్వొత్తులతో ప్రార్థనలు చేశారు. పాస్టర్ జ్యోతిబాబు ఆధ్వర్యంలో క్రైస్తవులకు అన్నదానం చేశారు. మండలంలోని రౌతులపూడి, ఎస్.పైడిపాల, ములగపూడి, గిడజాం, ఎస్.అగ్రహారం, లచ్చిరెడ్డిపాలెం, రాజవరం, పారుపాక, శృంగవరం తదితర గ్రామాల్లో క్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి వేడుకలు


యర్రవరంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


ప్రత్తిపాడులో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో సోమవారం మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న ఏబీ వాజ్‌పేయ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కురాకుల రాజా ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. వాజ్‌పేయి ఆశయాలను పార్టీశ్రేణులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం 1992లో అయోధ్య కరసేవకు వెళ్లిన తోట వెంకటరత్నం, అడపా సాంబయ్య, జువ్వాదుల రాజులమ్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, పార్టీ నాయకులు ఏనుగు ధర్మరాజు, డి.సాయిబాబా, కేలంగి రమణ, ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యల్లపు సూర్యనారాయణ, పార్టీ నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, దాకే కృష్ణారావు, మదినే బాబ్జి పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

కరప: తదేకం ఫౌండేషన్ సహకారంతో గ్రామంలో సోమవారం జేఎస్పీ నాయకుడు వైవీవీ సత్యనారాయణ గృహంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు పంతం నానాజీ ప్రారంభించారు. తదేకం ఫౌండేషన్ ప్రతినిధి చవ్వాకుల సందీప్, పార్టీ నాయకులు భోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, పి.ప్రసాద్, ఎస్.భవానీశంకర్, పి.పవన్‌కుమార్, జె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అనుకూలంగా చట్టాలు

కాకినాడ రూరల్: వినియోగదారులకు అనుకూలంగా చట్టాలున్నాయని జిల్లా వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యుడు కొమ్మూరి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏ వస్తువు కొన్నా లేదా నగదు చెల్లించి ఏ సేవ పొందినా, వాటిలో లోపాలుంటే మన ప్రాంతంలోనే ఫిర్యాదు చేసే అవకాశాన్ని చట్టం కల్పించిందన్నారు. ఫిర్యాదు చేసిన 120 రోజుల్లోగా పరిష్కారం లభిస్తుందని, 1915, 1800-14000కు నేరుగా ఫోన్‌కాల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అడబాల రత్నప్రసాద్, సుబ్బారావు, రాఘవరావు పాల్గొన్నారు.

బాలత్రిపుర సుందరి ఆలయానికి రంగులు

బోట్‌క్లబ్: బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి దాతల సహకారంతో రంగులు వేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రంగులు వేసేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఆలయంలో రంగులు వెలసిపోవడంతో దాతల సహకారంతో ఆలయం మొత్తం రంగులు వేయనున్నట్టు చెప్పారు. రంగులు వేసేందుకు ముందుకు వచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

మంచు మసకేసిందిలే..


పంట పొలాలను కమ్మేసిన పొగమంచు

ప్రత్తిపాడు: గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయం పొగమంచు కురుస్తోంది. మంచు ఎక్కువగా ఉండడంతో రోడ్లపై వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి 7 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ చలి తీవ్రత తగ్గడం లేదు. గత రెండు రోజులుగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రత్తిపాడు మండలంలో సోమవారం 17 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8.30 గంటలు దాటినా సూర్యుడు జాడ కనిపించడం లేదు. దీంతో ప్రజలు స్వెటర్లు, జర్కిన్లు వేసుకునే ఇంటి నుంచి బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ఉదయాన్నే పనుల కోసం వెళ్లే వారు చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు.

ఉప్పాడ నుంచి పిఠాపురం శ్రీపాద క్షేత్రానికి పాదయాత్ర

కొత్తపల్లి: మండలంలో దత్త జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉప్పాడలో దత్తమాల ధరించిన 45 మంది స్వాములు ఇరుముడి కట్టుకుని పాదయాత్రగా పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దత్తాత్రేయ మాలను ధరించి 41 రోజుల పాటు కఠోర దీక్ష చేశామని స్వాములు తెలిపారు.

వెచ్చని నేస్తాలు వచ్చేశాయ్

- రోజురోజుకూ పెరుగుతున్న చలి
- ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన దుప్పట్లు, జంబుఖానాల పంపిణీ
- నియోజకవర్గంలో 456 మందికి ప్రయోజనం

ప్రత్తిపాడు: గ్రామాల్లో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఎముకలు కొరికే చలిని తట్టుకోలేక వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. పల్లెల్లో ఉదయం 8 గంటల వరకూ పొగమంచు కురుస్తోంది. సాయంత్రం 6 గంటల నుంచే చలి తీవ్రత అధికమవుతోంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరినీ చలి వణికిస్తోంది. ఇంటి తలుపులు అన్నీ మూసినప్పటికీ చలిగాలులు ఇబ్బంది పెడుతున్నాయి. ఇళ్లల్లో ఉండేవారికే చలి బాధ తప్పనప్పుడు... ఇక ప్రభుత్వ వసతి గృహాల్లోని పేద విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వారి బాధను రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే గుర్తించింది. వసతి గృహాల్లోని విద్యార్థులకు దుప్పట్లు, జంబుఖానాలు పంపిణీకి చర్యలు తీసుకుంది.

నియోజకవర్గంలో ఆరు హాస్టళ్ల విద్యార్థులకు..

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాల్లోని 456 మంది విద్యార్థులకు నాణ్యమైన దుప్పట్లు, కింద పరచుకొని పడుకునేందుకు జంబుఖానాలను సిద్ధం చేసింది. ఇప్పటికే అధికారులు విద్యార్థిని, విద్యార్థులకు దుప్పట్లను, జంబుఖానాలను పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలంలో రెండు, శంఖవరం మండలంలో రెండు, రౌతులపూడి మండలంలో రెండు వెరసి ఆరు ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 253 మంది ఎస్సీ బాలురు, 93 మంది బీసీ బాలురు, 110 మంది బీసీ బాలికలు వసతి పొందుతున్నారు.

గతంలో సమస్యలతో సతమతం..

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలతో సతమతమయ్యేవారు. వసతి గృహాల్లో కిటికీలు, తలుపులు లేక కప్పుకునేందుకు దుప్పట్లు కానీ, జంబుఖానాలు కానీ లేక చలికి వణికిపోయేవారు. ఒక దుప్పటిలో ఇద్దరు ముగ్గురు నిద్రించిన పరిస్థితులు కూడా ఉన్నాయి. కాగా ప్రస్తుతం ఆ సమస్యలు లేవనే చెప్పాలి. నాడు - నేడు పథకంతో రాష్ట్ర ప్రభుత్వం అలాంటి సమస్యలకు చెక్ పెట్టింది. వసతిగృహాల రూపు రేఖలను మార్చేసింది. కిటికీలు, తలుపులతో పాటు ప్రహరీ, ఫ్లోరింగ్ వంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంది. ఏటా చలికాలంలో వసతి గృహాల్లోని ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ఒక దుప్పటి, ఒక జంబుఖానా పంపిణీ చేస్తోంది.


ప్రత్తిపాడు ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహంలో దుప్పట్లు కప్పుకుని నిద్రిస్తున్న విద్యార్థులు

నియోజకవర్గంలోని ప్రభుత్వ హాస్టళ్లు, విద్యార్థుల వివరాలు

మండలం	గ్రామం	ప్రభుత్వ వసతి గృహం	విద్యార్థుల సంఖ్య
ప్రత్తిపాడు	ప్రత్తిపాడు	ఎస్సీ బాలుర	123
	ప్రత్తిపాడు	బీసీ బాలికల	110
శంఖవరం	అన్నవరం	ఎస్సీ బాలుర	60
	శంఖవరం	ఎస్సీ బాలుర	34
రౌతులపూడి	రౌతులపూడి	ఎస్సీ బాలుర	36
	ములగపూడి	బీసీ బాలుర	93

సకాలంలో దుప్పట్లు అందాయి



కొద్ది రోజులుగా చలి తీవ్రత పెరిగింది. కొండవారగా వసతిగృహం ఉండడంతో చలి ఎక్కువగా ఉంటోంది. ప్రభుత్వం సకాలంలో కప్పుకునేందుకు దుప్పట్లు పంపిణీ చేసింది.

– మైలపల్లి అనసూర్య, 10వ తరగతి, ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహం, ప్రత్తిపాడు

దోమతెరలు ఏర్పాటు



ప్రత్తిపాడు ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు దుప్పట్లు, జంబుఖానాలను అందజేసాం. వైద్య ఆరోగ్యశాఖ దోమతెరలు కూడా పంపిణీ చేసింది. వీటితో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతోంది.

– ఎంఎస్ సత్యనారాయణ, సంక్షేమాధికారి, ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహం, ప్రత్తిపాడు


దుప్పట్లు పంపిణీ చేస్తున్నాం



విద్యార్థులకు గతేడాది దుప్పట్లు పంపిణీ చేశాం. ప్రస్తుతం చలి పెరగడంతో ప్రతిఒక్కరికీ దుప్పట్లు అందజేస్తున్నాం. రెండో విడతలో జంబుఖాలను కూడా అందజేస్తాం. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నాం.

– ఎస్.రాజేశ్వరి, సహాయ బీసీ సంక్షేమాధికారి, పెద్దాపురం

దిగంబరా.. శ్రీపాదవల్లభ దిగంబరా


విశేష అలంకారంలో శ్రీపాద శ్రీవల్లభ స్వామివారు

పిఠాపురం: దత్తాత్రేయుడి జన్మస్థలంగా పేరొందిన పిఠాపురంలో దత్త జయంత్యోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పాదగయ క్షేత్రంలో వెలసిన దత్తాత్రేయ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేలాది మంది దత్తస్వాములు, భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంతో పాటు అనఘాదత్త క్షేత్రం, శ్రీగోపాల్‌బాబా ఆశ్రమం వంటి పుణ్య క్షేత్రాల్లో దత్త జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శిచుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దత్త జయంతి సందర్భంగా పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. దత్తస్వాములు ఇరుముడులు సమర్పించి దీక్షలు విరమించారు. సాయంత్రం పాదగయ పుష్కరిణిలో స్వామి వారి తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. వందలాది మంది భక్తులు తిలకించి తరించారు.


పిఠాపురంలో దత్త స్వాముల గ్రామోత్సవం